


అశుతోష్.. ఇక ఐటిడిఎ పిఒ!

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొంత కాలం పనిచేసిన అశుతోష్ శ్రీ వాత్సవ్‌ని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆ బాధ్యతల నుంచి తప్పించింది. సబ్ కలెక్టర్‌గా వైశాలిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఐటిడిఎ పిఒగా పూర్తి స్థాయి బాధ్యతలను అశుతోష్ శ్రీవాత్సవ్ నిర్వహించనున్నారనే ప్రచారం సాగుతోంది. ఇంతవరకు సబ్ కలెక్టర్‌గా, ఐటిడిఎ పిఒగా ద్విపాత్రాభినయం చేసిన యువ ఐఎఎస్ అధికారి అశుతోష్ శ్రీ వాత్సవ్ ఇకనుంచి ఐటిడిఎ పిఒగా కొనసాగనున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలో విడుదల కానున్నట్లు సమాచారం. గిరిజన సంఘాల నాయకులు కూడా ఆయననే ఐటిడిఎ పిఒగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సీతంపేట ఐటిడిఎ పిఒగా యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం ఐటిడిఎ పిఒగా అశుతోష్ శ్రీవాత్సవ్‌ను నియమించే అవకాశం ఉంది.

ఉద్యోగులు కావలెను

అధికారుల ముందుచూపు లేమి, సిఫార్సుల ప్రభావం సీతంపేట మండలంపై పడింది. ప్రజల్ని ఇబ్బందుల పాల్జేసింది. ప్రభుత్వం ఇటీవల సాధారణ బదిలీ ప్రక్రియ చేపట్టింది. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంది. రెండేళ్లు దాటినవారు కూడా బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఉత్తర్వులిచ్చింది. బదిలీ అయిన ఉద్యోగి అదే స్థానంలో తిరిగి వస్తేనే ప్రస్తుత ఉద్యోగిని రిలీవ్ చేయాలని కూడా ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. అంతవరకు బాగానే ఉంది. ఉన్నతాధికారుల ఒత్తిడితో ఇక్కడ కొంతమంది సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లను అధికారులు రిలీజ్ చేశారు. తీరాచూస్తే, వారి స్థానంలో కొత్తవారు రాలేదు. ఆ ఖాళీలు అలానే ఉన్నాయి. దాంతో మిగతా సిబ్బందితో పని భారం పెరిగి ఒత్తిడికి లోనవుతున్నారు. మండలంలో మరిన్ని పోస్టులూ ఖాళీలు ఉండటంతో సేవల్లోనూ జాప్యమవుతోంది.



డిజిటల్ అసిస్టెంట్ లేని సీతంపేట గ్రామ సచివాలయం

- 13 సచివాలయాల్లో భర్తీకాని డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు
- ఐదు చోట్ల కార్యదర్శులూ...
- ఎంపిడిఒ కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీ
- మిగతా సిబ్బందిపై పని ఒత్తిడి
- జాప్యమవుతున్న పనులు
- ప్రజలు, విద్యార్థులకు అవస్థలు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండలంలో సుమారు 50 వేల మంది జనాభా. 53 పంచాయతీలు ఉంటే, 31 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో గోయిది, చిన్నబగ్గ, హడ్డుబంగి, కిసరజోడు, కిల్లాడ, కుడ్డపల్లి, మండ, మర్రిపాడు, పులిపుట్టి, పూతికవలస, వజ్జాయిగూడ.. ఇలా 13 సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు లేరు. దీంతో ఆయా సచివాలయాల్లో పనులు జాప్యమవుతున్నాయి. దీంతో ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగి దేనికీ న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది. దీనివల్ల ధ్రువపత్రాలు, మిగతా సేవలు సరిగా అందక విద్యార్థులు, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పెరిగిన పనిభారం

సచివాలయంలో ఎంతో కీలకమైనది డిజిటల్ అసిస్టెంట్ పోస్టు. విద్యార్థుల ధ్రువపత్రాలు, సంక్షేమ పథకాలు అప్లోడ్ చేయడం, రైతుల అడంగల్, పెన్షన్, రేషన్ కార్డులు ప్రతి పనీ డిజిటల్ అసిస్టెంట్ ద్వారానే జరగాలి. క్షణం తీరిక లేని డిజిటల్ అసిస్టెంట్లు పోస్టులు 13 ఖాళీగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా డిజిటల్ అసిస్టెంట్లకు ప్రభుత్వం ప్రత్యేకమైన శిక్షణలో మెలకువలు నేర్పింది. సచివాలయంలో మిగతా సిబ్బందితో వీరి పని చేయించినా అంత వేగంగా చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో వారిపై పనిభారం పెరిగి, ఒత్తిడి పడుతోంది. ఏదేమైనా అధికారులు పాలకులు స్పందించి, 13 డిజిటల్ అసిస్టెంట్లు పోస్టులు వెంటనే భర్తీ చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

కార్యదర్శులది అదే దారి

మండలంలో ఐదుగురు కార్యదర్శుల కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇందులో పూబ్బాడ కార్యదర్శి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వజ్జాయిగూడ, గులుమూరు, కుమ్మర గండి, కొండాడ కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆ సచివాలయాల పరిధిలో పంచాయతీల అభివృద్ధితో పాటు మిగతా పనులు కూడా ఆటంకం కలుగుతోంది.

ఎంపిడిఒ కార్యాలయంలోనూ..

సీతంపేట ఎంపిడిఒ కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో పని ముందుకు సాగడం లేదు. కార్యాలయ ఎఒ పోస్ట్ ఖాళీగా ఉంది. సీనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. ఎంపిడిఒ, డిప్యూటీ ఎంపిడిఒ పోస్టులు తప్ప మిగతావన్నీ ఖాళీగా ఉండడం గమనార్హం. దీంతో అటు అధికారులకు, ఇటు ప్రజలకు ఇబ్బందులు చెప్పడం లేదు.

కీలక మండలంలోనే..

సీతంపేట ఐటిడిఎ పరిధిలో సీతంపేట మండలం ప్రధానమైనది. ఎందుకంటే..? అనుక్షణం ఉన్నతాధికారుల నుంచి పాలకుల వరకు ఇక్కడి ఐటిడిఎలో అడుగు పెడుతూనే ఉంటారు. అంతేకాదు, గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తామని పాలకులు ప్రకటించడం తరచూ చూస్తూనే ఉన్నాం. అలాంటి కీలక మండలమైన సీతంపేటలో పూర్తిస్థాయిలో పోస్టులు భర్తీ కాకపోవడం విడ్డూరమే.

పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది



మండలంలో 13 డిజిటల్ అసిస్టెంట్, ఐదు కార్యదర్శి పోస్టులు, ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ, సీనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ పోస్టులు ఖాళీగా ఉండటం వాస్తవమే. ఆ పోస్టులు భర్తీ చేస్తే పనులు వేగవంతం చేయడానికి వీలు కలుగుతుంది.

– కొండపల్లి సత్యం, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

17, 18 తేదీల్లో జిల్లాకు భారీ వర్ష సూచన

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరగరాదని, ఇందుకోసం ముందుగా గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 17, 18 తేదీల్లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున లోతట్టు, నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను దండోరా, మైక్ ద్వారా ప్రచారం చేస్తూ అప్రమత్తం చేయాలన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలు స్నానాలు చేయడం, బట్టలు ఉతకడం, పశువులను కడగడం, ఇసుకను తవ్వడం వంటి పనులు చేపట్టరాదని తెలిపారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు ఎటువంటి పంట నష్టమూ జరగకుండా చూడాలన్నారు. పంట కాలువలు, గట్లు తెగిపోకుండా ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు ప్రధాన కేంద్రాలను విడిచి వెళ్లరాదని, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడం, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని తెలిపారు. శిథిలావస్థలోని భవనాలు, పాఠశాలల్లో ఎవరూ లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులు ఆరుబయట తిరగకుండా ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వంగిపోయిన, విరిగిపోయిన విద్యుత్ స్తంభాల పట్ల విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ నిత్యం అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, వైద్య ఆరోగ్యం పట్ల ఆయా శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, డిఆర్‌ఒ కె.హేమలత, ఇపిడిసిఎల్ ఎస్‌ఇ మల్లికార్జున, డిఇఒ బి.రాజకుమార్, డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కరరావు, డిపిఒ టి.కొండలరావు, సిపిఒ ఎస్.ఎస్.ఆర్.కె. పట్నాయక్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు, ప్రజా సంఘాల నాయకులు

రైతులకు ద్రోహం

- వ్యవసాయంలోకి కార్పొరేట్ కంపెనీలు వద్దు
- కలెక్టరేట్ ఎదుట రైతు, ప్రజాసంఘాల ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం

కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం దేశంలో రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రైతులకు ద్రోహం చేస్తోందని రైతు, రైతుకూలీ, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు, కార్మిక నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ సంస్థలను తీసుకుని వచ్చే ఆలోచన, నిర్ణయం మానుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు పండే భూములు కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా ఇవ్వొద్దన్నారు. రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బంటు దాసు, ఎపి రైతు సంఘం నాయకులు ఇవి నాయుడు, రైతు కూలీ సంఘం నాయకులు పి.శ్రీను నాయుడు, కృష్ణవేణి, ఎం.భాస్కర రావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు పి. సంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిన మోహన్, గేదెల రామకృష్ణ, వంగల దాలి నాయుడు, ఎఐటియుసి నాయకులు ఆర్‌విఎస్ కుమార్, దుర్గారావు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోరాడారు.. సాధించుకున్నారు

సిపిఎం ఆధ్వర్యాన గిరిజనుల పోరాటం • గుమడింగిలో పాఠశాల ఏర్పాటు



ఉపాధ్యాయుడితో మాట్లాడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-కొమరాడ

సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు చేసిన పోరాటం ఫలించింది. గుమడింగిలో పాఠశాల ఏర్పాటైంది. గిరిజన విద్యార్థులకు విద్య చేరువైంది. ఇంతకీ ఏం జరిగిందంటే..?

కొమరాడ మండలంలోని పూడేసు పంచాయతీ పరిధిలో గుమడింగి గ్రామానికి పాఠశాల లేక, గిరిజన విద్యార్థులు చదువు కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. వెంటనే పాఠశాల ఏర్పాటు చేసి, 25 మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అక్కడి గిరిజనులు పోరుబాట పట్టారు. ప్రతీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో మూడు సార్లు వినతులు అందజేశారు. చివరికి బుధవారం నుంచి ఆ గ్రామంలోని ప్రయివేటు భవనంలో పాఠశాల ఏర్పాటు చేయడంతోపాటు ఉపాధ్యాయుడు ఆర్.రామారావును నియమించారు. ఈ నేపథ్యంలో సిపిఎం జిల్లా నాయకులు కె.సాంబమూర్తి మాట్లాడుతూ పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్న కలెక్టర్, ఐటిడిఎ పిఒ, డిఇఒ, డిడికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ గ్రామానికి రహదారి లేకపోవడంతో గ్రామస్తులంతా సుమారు రెండు లక్షల రూపాయల వరకు డబ్బులు పోగుచేసుకుని, చిన్న రహదారి నిర్మించుకున్నారని తెలిపారు. ఆ గ్రామానికి రహదారి సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.



పిఎసిఎస్ చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి సంధ్యారాణి

రైతుల అభివృద్ధికి

పిఎసిఎస్‌లు దోహదం

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

గ్రామీణ ప్రాంతంలో ఉండే రైతులకు అన్ని రకాలైన సేవలను, ఆర్థిక అవసరాలను తీరుస్తూ వారి అభివృద్ధికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు దోహదపడతాయని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అలాంటి పిఎసిఎస్‌లను మరింత అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత చైర్మన్‌దేనని స్పష్టంచేశారు. పట్టణంలోని శ్యామలాంబ ఆలయం వద్ద సాలూరు పిఎసిఎస్ చైర్మన్‌గా నెక్కెళ్ళ వెంకటరమణ, సభ్యులుగా గాడి లక్ష్మణ రావు, మీసాల నవీన్‌తో బుధవారం ఆమె ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రైతులకు వ్యవసాయానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని, ఎరువులు, పురుగుల మందులు అందిస్తూ, పండించే పంటను కొనుగోలు చేయడం ద్వారా వారి అభివృద్ధిలో పిఎసిఎస్‌లు ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. రైతుల హక్కులను కాపాడటం, వారి సంక్షేమాన్ని పెంపొందించడం ద్వారా గ్రామీణ ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, పప్పల మోహన్‌రావు, అక్యాన అప్పారావు, హర్ష పాల్గొన్నారు.

ఎంఇఒల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఎంఇఒ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం బుధవారం వినతి అందించారు. ఒకే ప్రదేశంలో ఎనిమిదేళ్ల పైబడి పనిచేస్తున్నా ఇంతవరకు బదిలీలు నిర్వహించక పోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎంఇఒలకు బదిలీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాథమిక, పాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ డిడిఒగా వ్యవహరిస్తున్న ఎంఇఒ-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



విఆర్‌ఎస్ గేట్లు ఎత్తి విడిచిపెడుతున్న నీరు

గోముఖి నదిలోకి నీరు విడుదల

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని వెంగళరాయసాగర్ రిజర్వాయరుకు నదుల నుంచి వరద ప్రవాహం ఎక్కువైంది. దీంతో బుధవారం విఆర్‌ఎస్ నీటిని గోముఖి నదిలోకి విడుదల చేశారు. సుమారు 300 క్యూసెక్కుల నీటిని గోముఖి రెగ్యులేటర్ ద్వారా విడుదల చేసినట్లు ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి ప్రశాంత్ తెలిపారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అక్టోబరు 7న పైడితల్లమ్మ సిరిమానోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్రుల కల్పవల్లి పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం ఖరారయ్యింది. అక్టోబరు 6న అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, 7న సిరిమానోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు ప్రకటించారు. అమ్మవారి దేవస్థానం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఉత్సవ వివరాలను వెల్లడించారు. పైడితల్లి అమ్మవారి ఉత్సవాలకు సెప్టెంబరు 12న పందిరాటతో శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఆరోజున చదురుగుడి వద్ద ఉదయం 9.30 గంటలకు, వనం గుడివద్ద 11 గంటలకు పందిరి రాట వేస్తామని చెప్పారు. అదేరోజున అమ్మవారి మండల దీక్ష ఉదయం 8 గంటలకు చదురగుడి వద్ద ప్రారంభిస్తామన్నారు. అక్టోబరు 2న అర్ధమండల దీక్ష ప్రారంభమవు తుందన్నారు. 6వ తేదీ సోమవారం తొలేళ్ల ఉత్సవం, 7వ తేదీ మంగళ వారం సిరి మానోత్స వం జరుగు తుందని తెలిపారు. పెద్ద చెరువులో 14న తెప్పోత్సవం జరుగు తుంద న్నారు. 19న కలశ జ్యోతి ఊరేగింపు వనం గుడివద్ద సాయంత్రం 5.30గంటలకు ప్రారంభమవు తుందని చెప్పారు. 21న ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని నిర్వహిస్తామని, 22న చండీ హోమం, పూర్ణాహుతితో పైడి మాంబ ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

ఐటిడిఎలకు పిఒలను నియమించాలి

ప్రజాశక్తి -కురుపాం

పార్వతీపురం పాలకొండ సబ్‌కలెక్టర్లుగా అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్ కుమార్ రెడ్డిని బదిలీ చేసిన నేపథ్యంలో వారిని పూర్తిస్థాయి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులుగా నియమించాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ కోరారు. బుధవారం కురుపాంలో ఆయన మాట్లాడుతూ పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లుగా బాధ్యతలు చేపట్టి, ఐటిడిఎలకు అదనపు బాధ్యతలు స్వీకరించిన వారిద్దరు గిరిజన సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించడమే కాకుండా పరిష్కారం కోసం ఎంతగానో కృషి చేశారని తెలిపారు.

ఇలాంటి అధికారులను ఐటిడిఎలకు మరో ఏడాది కాలం పిఒలుగా కొనసాగిస్తే గిరిజన అభివృద్ధికి అవకాశం ఉంటుందని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి దృష్టి సారించి, వారిని ఐటిడిఎ పిఒలుగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలి కోరారు.

ఉచిత బస్సు పేరుతో పొట్ట కొట్టొద్దు

ఆటో కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-బలిజిపేట

ఉచిత బస్సు పేరుతో తమ పొట్ట కొట్టొద్దని కోరుతూ ఆటో కార్మికులు బుధవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. బలిజిపేట, అరసాడ, నారాయణపురం, వంతరాం, నూకలవాడ, పెదపెంకి, తుమరాడ ఆటో స్టాండ్లకు చెందిన ఆటో కార్మికులు బలిజిపేట హైస్కూల్ సెంటర్ నుండి నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, ఆటో వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.సీతారాం, మోహన్‌రావు మాట్లాడారు. ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తే ఆటో కార్మికులలో 70 శాతం మందికి ఉపాధి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక పథకం ప్రవేశపెట్టినప్పుడు దాని ప్రభావం వల్ల ఎంతమందికి నష్టం జరుగుతుందో కూడా పరిశీలించి శాస్త్రీయంగా నష్ట పరిహారాన్ని, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉపాధి లేక ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉచిత బస్సు పథకం పెట్టిన తర్వాత ఇంకా ఆటో, టాక్సీ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి నెలా పింఛను చెల్లించాలని డిమాండ్‌చేశారు. వాహన మిత్ర తరహా పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఆటో, టాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.25 వేలు పరిహారం చెల్లించాలని కోరారు. ఇప్పటికే వాహనాలపై తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు తిరుపతిరావు, గంగారావు, వెంకటేష్, రమేష్, శివ, రాము, నారాయణ, సత్యనారాయణ, శ్రీను, శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న ఆటో కార్మికులు, సిఐటియు నాయకులు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డిపిఒ కొండలరావు

సంపద కేంద్రాలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని కిమ్మి గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల నిర్వహణ వల్ల గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. సేకరించిన చెత్త సంపద కేంద్రానికి తరలించి సేంద్రీయ ఎరువు తయారు చేస్తారని, వీటిని రైతులు వినియోగించుకుని, పంటలు సాగు చేయాలని సూచించారు. సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేయడం వల్ల పెట్టుబడి తగ్గడంతోపాటు అధిక దిగుబడి వస్తుందన్నారు. అంతేకాకుండా ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు కాలువలో చెత్త తొలగించాలన్నారు. సంపద కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్ శంకర్రావు, సర్పంచ్ జి.రామ్మోహన్ రావు, సచివాలయ కార్యదర్శి పెద్దింటి తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.

జర్మన్ భాషపై ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-పార్వతీపురం

జర్మనీ దేశంలో అసిస్టెంట్ నర్సు ఉద్యోగాలు పొందేందుకు జిల్లాలోని జిఎన్ఎం చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు జర్మన్ భాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓంకాప్, టిఎన్ఎఐ సంయుక్త ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుందని వివరించారు. తప్పనిసరిగా జిఎన్ఎం పూర్తిచేసి ఏడాది పాటు సాధారణ ఆసుపత్రుల్లో అనుభవం కలిగి 39 ఏళ్లలోపు వయసున్న వారు జర్మన్ భాష నేర్చుకోవడానికి అర్హులని తెలిపారు. రోజుకు 2 నుంచి 3 గంటల పాటు సుమారు 8 నెలల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఇందులో ఎ1, బి2 లాంగ్వేజ్ లపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రూ.30 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేసి, జర్మనీ వెళ్లేందుకు విమాన ఛార్జీలు, బి2 పరీక్ష ఫీజు, వీసా ఛార్జీస్ చెల్లించాలని చెప్పారు. శిక్షణ పూర్తి చేసి బి2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి నెలకు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు జీతం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు బయోడేటాను skillinternational@ apssdc.in కు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 70320 60773 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కొమరాడ

సెప్టెంబర్ 13 ,14 తేదీల్లో పాలకొండలో జరిగే సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షులు షేక్ మస్తాన్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. రాజకీయ వేధింపుల ఆపాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

యాప్‌తో అవకతవకలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మన డబ్బులు- మన లెక్కలు యాప్‌తో స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలన్నీ పక్కాగా ఉంటాయని ఎపిఎం జయమ్మ తెలిపారు. బుధవారం సాలూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండలంలో ఉన్న ఐదు విఒఎల పరిధిలోని సభ్యులకు మన డబ్బు - మన లెక్కలు యాప్‌పై ప్రత్యేక శిక్షణను వెలుగు సిబ్బంది నిర్వహించారు. సిసి సత్యనారాయణ, ఎల్‌సి వాసు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎపిఎం మాట్లాడుతూ ప్రతి సంఘం సభ్యుల పొదుపు, అప్పు ఎంత ఉందో వివరాలను, నిరక్షరాస్యులు కూడా తెలుసుకునేలా యాప్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. దీంతో జవాబుదారీ తనం ఉంటుందని తెలిపారు. ఈ యాప్‌ను ఈ నెల 16 నుంచి అమల్లోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిసిలు, విఒఎలు, సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-సీతంపేట



ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

సీతంపేటలోని రెండు ఎరువుల దుకాణాల్లో తహశీల్దార్ డి.శ్రీకన్య, మండల వ్యవసాయ అధికారి వై.వాహిని బుధవారం తనిఖీలు చేపట్టారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. బిల్లులపై ఆరా తీశారు. ఉన్న స్టాకు, రికార్డుల్లో ఉన్నది వ్యత్యాసాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువులు అధిక ధరలకు అమ్మకూడదని షాపుల యజమానులకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని కెజిబివిలో 2025-26 విద్యా సంవత్సరానికి తాత్కాలికంగా నాలుగు పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఇఒ డి.గౌరినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతిగృహ సంక్షేమ అధికారి, పార్ట్ టైం టీచరు, హెడ్ కుక్, చౌకీదారు పోస్టులతోపాటు రెండు సహాయక కుక్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మహిళల ద్వారా మాత్రమే పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. వీరఘట్టం, నడుకూరు గ్రామస్తులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. 16వ తేదీ లోపు దరఖాస్తులను స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని సూచించారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కొమరాడ

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని ఎంఇఒ-2 జి.తిరుపతిరావు అన్నారు. అర్థం మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తెలుపు రంగు దుస్తులను పార్వతీపురం స్వామి అయ్యప్ప క్లాత్ స్టోర్ యజమానులు బుధవారం పంపిణీ చేశారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు మజ్జి గౌరిశంకరరావు.. పిల్లలు అభ్యసన సామర్థ్యాలు పరీక్షించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామ్మోహన్ రావు, ఎన్.శాంతి నిర్మల జ్యోతి, తలగాపు రామక్రిష్ణ, శివ, పోలినాయుడు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-కొమరాడ

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు పెట్టి బహుమతులు అందజేస్తున్నట్లు శ్రీ రేణుక స్వచ్ఛంద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.రేణుక అన్నారు. బుధవారం శివిని వద్ద ఉన్న రాయల్ అకాడమీ, శ్రీ రేణుక స్వచ్ఛంద సంస్థ వద్ద విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల గురించి, దేశభక్తిపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16 నుంచి మహిళలకు కుట్టుమిషన్లు, అల్లికలు, ఇతర రంగాల్లో శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల్లో ఉన్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఉమ, గోవింద్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

ఐక్యతకు ప్రతిరూపం జాతీయ జెండా

మంత్రి సంధ్యారాణి



ర్యాలీలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి, అధికారులు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

జాతి సమగ్రతకు, ఐక్యతకు ప్రతిరూపం జాతీయ జెండా అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. బుధవారం సాలూరు పట్టణంలో పట్టణ ప్రజలు, అధికారులతో కలిసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుండి ఎస్‌బిఐ బ్రాంచి వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగుర వేయడం ద్వారా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. దేశం, జాతి పట్ల ప్రతి పౌరుడు బాధ్యతను గుర్తించు కోవాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం వల్ల మనందరిలో ఐక్యత, సోదరభావం పెరుగుతాయని చెప్పారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, తహశీల్దార్ నీలకంఠరావు, నోడల్ అధికారి డాక్టర్ శివకుమార్, ఐసిడిఎస్ పిఒ మంగమ్మ, పట్టణ సిఐ బి అప్పలనాయుడు, రూరల్ సిఐ పి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో ఎంపిడిఒ కె.సత్యం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఎపిఒ సాగర్, కార్యదర్శులు రామకృష్ణ, వినోద్, పాపారావు, శ్యామ్, ఉష, అప్పలసూరి, రాజారావు, రవి, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : విద్యార్థి దశ నుండే దేశభక్తిని అలవర్చుకోవాలని ఎంజెపి పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ అన్నారు. బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పాఠశాల నుండి కురుపాం బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బోట్ అనిల్, గౌడ్ బాలంకి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

15 కిలోల పాలిథిన్ కవర్లు స్వాధీనం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో నాలుగు రోడ్ల కూడలిలో, బంధం వారి వీధిలో ఉన్న దుకాణాల్లో బుధవారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.పకీర్ రాజు ఆధ్వర్యంలో సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీలు దాడులు చేపట్టారు. 15 కిలోల ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లను స్వాధీనం చేసుకున్నారు. రూ.10,500 జరిమానా వసూలు చేశారు. స్వచ్ఛ పార్వతీపురం దిశగా పట్టణాన్ని తయారు చేసేందుకు కృషి చేస్తున్నామని పకీర్‌రాజు తెలిపారు. అందులో భాగంగా ప్లాస్టిక్ అమ్మకాలు, వినియోగంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తం

ప్రజాశక్తి-పాలకొండ

జిల్లాకు భారీవర్ష సూచన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి వరద సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ధర్నా



ధర్నా చేస్తున్న ఫెడరేషన్ నాయకులు, మృతిచెందిన కార్మికుల కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. బుధవారం పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట మరణించిన కుటుంబ సభ్యుల ఫొటోలతో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి కమిషనర్ రాజుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఫెడరేషన్ నాయకులు ఎన్.శంకర్రావు, సిహెచ్.సింహాచలం మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో ఆప్కాస్ విధానంలో మరణించిన పారిశుధ్య కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, జిఒ నెంబర్ 25 ప్రకారం పటిష్టంగా అమలు చేయాలని చట్టం ఉన్నప్పటికీ పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో అమలు కాకపోవడం అన్యాయమని మండిపడ్డారు. నైట్ డ్యూటీలు చేస్తున్న కార్మికులకు రక్షణ లేదని, వాహనాలు, ఆకతాయిల వల్ల ప్రమాదాలు సంభవించే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. యోగాంధ్రలో పనిచేసిన కార్మికులకు టిఎలు, డిఎలు ఇవ్వాలని, మున్సిపల్ వాహనాలు నడుపుతున్న సీనియర్ వర్కర్లను డ్రైవర్లుగా గుర్తించాలని కోరారు. మున్సిపల్ వర్కర్లపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఇదే తీరు కొనసాగితే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు ఎన్.మల్లేష్, పి.గాంధీ, ఆర్.వెంకటరమణ, శీల వినయ్ కుమార్, కె.రాంబాబు, హెచ్ మహేంద్ర, జె.లక్ష్మి, బి.నాగమణి, బి.భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బాగుంటేనే సమాజం బాగుంటుంది

ఎమ్మెల్యే విజయ్‌చంద్ర



ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

రైతు బాగుంటేనే సమాజంతోపాటు అందరం బాగుంటామని, అటువంటి రైతులను ఆదుకోవడం కోసం కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర తెలిపారు. అన్నదాత సుఖీభవ అమలుపై హర్షం వ్యక్తంచేస్తూ బుధవారం నర్సిపురం నుంచి పార్వతీపుర మార్కెట్ యార్డ్ వరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆనందోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా నర్సిపురంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 20 సెంట్లు ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకూ రూ.20 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం ఆదుకుంటోందని చెప్పారు. ఆనందోత్సవ ర్యాలీలో 130 ట్రాక్టర్లతో రైతుల పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆది కర్మయోగి'తో ఏజెన్సీలో మార్పులు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఆది కర్మయోగి కార్యక్రమం గిరిజన ప్రాంతంలో మార్పు తెచ్చుటకు గొప్ప అవకాశమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఆది కర్మయోగి బ్లాక్ స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆది కర్మయోగి కార్యక్రమం వివరాలను వెల్లడించారు. మొదటి దశలో 6 మండలాలకు సంబంధించిన శిక్షకులకు శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఆది కర్మయోగి కార్యక్రమం గిరిజన ప్రాంతాల మార్పును గొప్ప ప్రభావితం చేయనుందని చెప్పారు. సామాజిక భాగస్వామ్యం, అవగాహనతో గ్రామాల్లో అవసరాలను గుర్తించి సామాజిక బాధ్యతతో చేపడుతున్నట్లు వివరించారు. గ్రామసభలు నిర్వహించడం, గ్రామాల్లో గ్రామస్తులతో సహా బృందాలు పర్యటించి అక్కడి అవసరాలను గుర్తించడం తద్వారా వాటిని పరిష్కరించే మార్గం అన్వేషించడం జరుగుతుందని ఆయన చెప్పారు. గ్రామ స్థాయి అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయనున్నట్లు వివరించారు. ఇందుకు ఆన్‌లైన్ టూల్‌ను డిజైన్ చేశామని, గ్రామాల్లో గుర్తించిన అంశాలను అందులో పొందుపరచడం వల్ల వారి అవసరాలు తెలుస్తాయని చెప్పారు. ఆది కర్మయోగులుగా పలువురు స్వచ్ఛంద కార్యకర్తల భాగస్వామ్యంతో గ్రామాల్లో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అంశంలో చిత్తశుద్ధితో ప్రతిఒక్కరూ పనిచేయాలని తద్వారా మంచి ఫలితాలు సాధించగలమని స్పష్టంచేశారు. సామాజిక భాగస్వామ్యం, సామాజిక అవగాహన ప్రధాన అంశంగా సాగుతున్న ఈ కార్యక్రమం జిల్లాలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఆది కర్మయోగి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మనది అనే సొంత భావన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పనిచేసే ముందువరస సిబ్బంది బాధ్యత ఎనలేనిదని చెప్పారు. కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ పిఎం జన్‌మన్ ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రతి అంశాన్నీ నిశితంగా అంచనా వేసి దానిని వాస్తవంగా పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన కర్మయోగులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్, జిల్లా స్థాయి శిక్షకులు రెడ్డి, రఘు, సోమేశ్వరరావు, శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-గరుగుబిల్లి

ప్రతీ ఆరోగ్య కార్యక్రమంపై వైద్య సిబ్బంది దృష్టి పెట్టాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే విధంగా కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కర్ రావు సూచించారు. ఈమేరకు బుధవారం గరుగుబిల్లి, గొట్టివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. అక్కడి వార్డుల్లో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకుని, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఒపి వివరాల రికార్డులు పరిశీలించారు.

పిఎంజెఎవై, పిఎంఎంవై, ఎన్‌సిడిసిడి ఎనీమియా యాక్షన్ కమిటీలతో చర్చించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వైద్యం దృష్ట్యా రోగులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన ప్రతీ ఆరోగ్య యాప్‌పై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. తద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలన్నారు. ఎప్పటికప్పుడు గర్భిణులు, శిశువుల్లో అనారోగ్య లక్షణాలను గుర్తించాలని, ఫలితంగా ప్రమాదకర స్థితికి చేరకుండా జాగ్రత పడవచ్చని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ఇ-ఆశా యాప్‌లో ఆరోగ్య వివరాలు నమోదు చేయాలన్నారు. అనంతరం గొట్టివలస గ్రామంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రామ్ ఆఫీసర్ టి.జగన్మోహనరావు, వైద్యాధికారి తిరుమల ప్రసాద్, సూపర్వైజర్లు జగదీశ్వరి, ఉదయ్ కుమారి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కురుపాంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ నారాయణరావు

ప్రజాశక్తి - కురుపాం

మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.కుమార స్వామి, కురుపాం, నీలకంఠాపురం ఎస్ఐలు పి.నారాయణరావు, ఎ.నీలకంఠరావు కోరారు. మాదకద్రవ్య రహిత భారతదేశం ప్రచారంలో భాగంగా బుధవారం కురుపాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, నీలకంఠాపురంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎ.రామ్మోహన్‌రావు, ఎం.రమేష్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరం : యాంటీ డ్రగ్స్‌పై ఎస్ఐ ఎం.రాజేష్ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలకొండ : యాంటీ డ్రగ్స్‌పై ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బుధవారం సిఐ ఎం.చంద్రమౌళి ఆధ్వర్యాన మానవహారం నిర్వహించారు. మత్తు పదార్థాలు, గంజాయి, గుట్కా, సిగరెట్ వంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా, ఇప్పటినుండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సిఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రయోగమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేటలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు మాదకద్రవ్య రహిత భారతదేశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ వై.అమ్మన్నరావు మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిస కాకూడదని సూచించారు. గుట్కా, గంజాయి వంటి మాదకద్రవ్యాలతో దొరికితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎస్ఐ జి.కళాధర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ గాయత్రి పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుండి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సీతానగరం.. ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, అధ్యాపకులు, విద్యార్థులు

ఉద్యాన కళాశాల ద్వితీయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో ఉన్న ఉద్యాన కళాశాల ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ అఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ ఎస్.సూర్యకుమారి మాట్లాడుతూ విద్యార్థులు సమయం వృథా చేయరాదని సూచించారు. ఎస్ఐ రమేష్ నాయుడు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, చక్కటి భవితను నిర్వీర్యం చేసుకోవద్దని కోరారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని కర్రివలస గ్రామానికి చెందిన కంది పోలినాయుడు (50) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలినాయుడు మద్యానికి బానిసై, కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరగడంతో ఈ నెల 10న భార్య సింహాచలం మందలించింది. దీంతో మద్యం మత్తులో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి విజయనగరంలోని ఆస్పత్రిలో బుధవారం తెల్లవారుజామున పోలి నాయుడు మరణించాడు. భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న టాటా ఎసి

ప్రజాశక్తి-గరుగుబిల్లి

మండలంలో ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద బుధవారం బైక్‌ను టాటా ఎసి వాహనం ఢీకొంది. దీంతో పెద్దూరు గ్రామానికి చెందిన తెర్లి అప్పలనాయుడుకు గాయాలయ్యాయి. ఆయన్ను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. టాటా ఎసిని డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైనట్లు ఎస్ఐ రమేష్ నాయుడు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

స.హ చట్టంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-కొమరాడ

సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కొమరాడ పిఎసిఎస్ ఛైర్మన్ గుల్లిపల్లి సుదర్శన్ రావు అన్నారు. బుధవారం కొమరాడ పిఎసిఎస్ వద్ద సమాచార హక్కు చట్టం, ఇతర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పిఎసిఎస్ ద్వారా రైతులకు అందించిన ఎరువులు, విత్తనాలు వివరాలను వెల్లడించారు. రైతులకు ఇప్పటివరకు అందజేసిన రుణాలు, రికవరీ విషయాలను వివరించారు. రుణాలు తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలను పూర్తిస్థాయిలో రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు మరిచర్ల హైమావతి, ఎం.రమేష్, మాజీ సొసైటీ అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

కురుపాం : ప్రతిఒక్కరూ సమాచార హక్కు చట్టం పై అవగాహన కలిగి ఉండాలని కురుపాం పిఎసిఎస్ ఛైర్మన్ డొల్లు కిశోర్ అన్నారు. బుధవారం పిఎసిఎస్ కార్యాలయంలో సొసైటీ సభ్యులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీ తనం తీసుకురావడం, అధికార యంత్రాంగం అధీనంలో ఉన్న సమాచారం ప్రజల కోరిక మేరకు అందివ్వడం సమాచార హక్కు చట్టం లక్ష్యమన్నారు. సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సిఇఒ జి.రాము, సిబ్బంది పాల్గొన్నారు.